క్లుప్తంగా

గజపతినగరం ఆర్ఐగా అప్పలరాజు


ఆర్ఐ అప్పలరాజు

గజపతినగరం: మండల ఆర్ఐ(రెవెన్యూ ఇన్స్పెక్టర్)గా కె.అప్పలరాజు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన తెర్లాం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్చార్జి ఆర్ఐగా పనిచేసిన మురళీకి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

బొండపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలతున్న నేపథ్యంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలందించాలని స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ సూచించారు.ఆశ డే సందర్భంగా పీహెచ్సీలో మంగళవారం వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి వనరుల వద్ద, నివాస ప్రాంతాల్లో మురుగునీరు, చెత్త, కొబ్బరి బొండాల చిప్పలు, వాడి పారేసిన ప్లాస్టిక్ వస్తువులు నిల్వలేకుండా చూసుకునేలా, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు రహిత జిల్లాయే లక్ష్యం


అలమండ పీహెచ్సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

జామి: కుష్ఠు రహిత జిల్లాయే లక్ష్యంగా పని చేయాలని వైద్యసిబ్బందికి డీఎంహెచ్ఓ భాస్కరరావు పిలుపునిచ్చారు. జామి మండలంలోని అలమండ పీహెచ్సీలో మంగళవారం నిర్వహించిన ఆశ డేలో ఆయన మాట్లాడారు. స్పర్శలేని మచ్చలు, నూనె పూసినట్టు నిగనిగలాడే చర్మం, అరిచేతులు, అరికాళ్ల కండరాలు బలహీనత కుష్ఠువ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. సకాలంలో మందులు వాడితే కుష్ఠువ్యాధి నివారణ సులభమన్నారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి శ్రావ్య, సీహెచ్ఓ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్ప్రేమ్కుమార్, ఎంపీహెచ్ఓలు నారాయణరావు, సత్తిరాజు, ఎంఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్

బొండపల్లి: ఏటీఎం విధానంలో కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఏడాదంతా ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి కె.హేమసుందర్ చెప్పారు. ఏటీఎం విధానంలోకొత్తపాలెం గ్రామంలో రైతు సీహెచ్.కాసులమ్మ సాగుచేస్తున్న కూరగాయల పంట క్షేత్రం వద్ద రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో 20 సెంట్ల విస్తీర్ణంలో 18 రకాల కాయగూరల పంటలను సాగు చేయవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త మోపాడ కిశోర్ కుమార్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు మెమోలు

గంట్యాడ: మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు విధులకు డుమ్మా కొడుతూ ఆయాలతో కేంద్రాలు నిర్వహిస్తుండడంపై 'విధులకు డుమ్మా..!' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. సిరిపురం, లక్కిడాం, గంట్యాడ అంగన్వాడీ కార్యకర్తలకు గంట్యాడ ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమాభారతి మెమోలు జారీ చేశారు.

రేషన్ లబ్ధిదారులకు కందిపప్పు ఇవ్వాలి

శృంగవరపుకోట: తెలుపురంగు రేషన్కార్డుదారులందరికీ రేషన్ డిపోల ద్వారా ప్రభుత్వం కందిపప్పు అందజేయాలని ఆమ్ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాప్వర్మ కోరారు. మండల కేంద్రంలో తహసీల్దార్ అరుణకుమారిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ఈనెల నుంచి తెలుపురంగు రేషన్కార్డుదారులకు బియ్యంతో పాటు, పంచదార, కందిపప్పు ఇస్తామని ప్రకటించిందన్నారు. క్షేత్రస్థాయిలో పంపిణీ జరగడం లేదని అన్నారు. వేలి ముద్ర పడలేదంటూ ఒక్కో కార్డుదారునిచేత రెండు, మూడు ధపాలు ముద్రవేయించి బియ్యం మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. అందరికీ ఖచ్చితంగా కందిపప్పు ఇచ్చేలా చూడాలని, తూకాల్లో మోసాలు, బియ్యం అక్రమ కొనుగోళ్లు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చుక్కలు చూపిస్తున్న కూరగాయల ధరలు

- కార్తీకం రాకముందే ఆకాశన్నంటుతున్న ధరలు
- నిత్యావసర నరుకుల ధరలు కూడా రోజురోజుకీ పైపైకి
- రేషన్ డిపోల నుంచి అందని కంది పప్పు


చీపురుపల్లి రైతుబజారులో కూరగాయల దుకాణం

చీపురుపల్లి: కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. సామాన్యులకు అందుబాటులో లేనివిధంగా రోజురోజుకీ పెరిగిపోతున్న కూరగాయ లతో పాటు నిత్యావసర సరుకుల ధరలు హడలెత్తిస్తున్నాయి. కొన్నిరకాల కూరగాయల ధర సెంచరీకి చేరువయ్యాయి. సాధారణంగా కార్తీక మాసం లో కూరగాయల ధరలు పెరగడం చూస్తుంటాం. ఎందుకంటే కార్తీక మాసంలో సాధారణంగా మాంసాహారం తినే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది కాబట్టి కూరగాయల ధరలు అమాంతం పెరుగుతాయి. కానీ కార్తీకం రావడానికి నెల రోజుల ముందు నుంచే కూరగాయల ధరలు మండిపోతు న్నాయి. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ లేకపోవడంతో మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయల నుంచి కూరగాయల వరకు ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరిగిపోవడంతో సామాన్యుల పరిస్థితి దారుణంగా తయారయింది. ధరలు పెరిగిపోయినప్పుడు అదుపు చేయాల్సిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

అమాంతం పెరిగిన టమాటా ధర

సాధారణంగా ప్రతి వంటలో వినియోగించే టమాటా ధర అమాంతం పెరిగిపోయింది. కొద్ది రోజుల క్రితం వరకు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు లభించే ది. నాలుగు రోజుల క్రితమే రూ.100 వరకు పెరిగింది. రెండు రోజుల క్రితం నుంచి కిలోపై పది రూపాయలు తగ్గించి రూ.90కు విక్రయిస్తున్నారు. దొండ కాయలు, బెండ, చిక్కుడు, మునగ, బీర, పచ్చిమిర్చి ఇలా అన్ని కూరగాయల ధరలు వినియోగదారుడికి దడపుట్టిస్తున్నాయి. కూరగాయలకు పోటీగా పప్పులు, వంట నూనెల ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. రేషన్ డిపోల ద్వారా తెలుపు రంగు రేషన్కార్డు లబ్ధిదారులకు కంది పప్పు సరఫరా గతంలో జరిగేది. తాజాగా రేషన్ డిపోల నుంచి కంది పప్పు సరఫరా నిలిచిపోవడంతో అటు కూరగాయలు కొనలేక ఇటు కంది పప్పు లేక ఏం వండుకోవాలో, ఏం తినాలో తెలియక సామాన్య ప్రజలు సతమతమవుతున్నారు.

మార్కెట్లో కూరగాయల ధరల వివరాలు(కిల్లోలో)...

టమాటా:	రూ.90
బీర:	రూ.60
వంగ:	రూ.50
దొండకాయలు :	రూ.70
చిక్కుడు:	రూ.50
పాట్టి చిక్కుడు:	రూ.100
ఆగాకర:	రూ.120
మునగ:	రూ. 100
కాకర :	రూ.50
కాప్సికం :	రూ.100
క్యారెట్:	రూ.60
బెండ:	రూ. 60
ఎర్రదుంపలు:	రూ.60
పచ్చిమిర్చి:	రూ: 60
బంగాళదుంప:	రూ: 50

మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ


చీపురుపల్లి: చీపురుపల్లిలోని ఆలయంలో మహాలక్ష్మీ దేవి అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు


బొండపల్లి: కరెన్సీ నోట్ల అలంకరణలో దేవుపల్లిలోని రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు


జామి: అలమండ ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి


జామి: జామి బజారు సెంటర్ వద్ద మండపంలో కరెన్సీనోట్ల అలంకరణలో అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాలు చీపురుపల్లి, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో ఆరో రోజైన మంగళవారం మండపాలు, ఆలయాల్లోని అమ్మవార్లు శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని అర్చకులు లక్ష్మీదేవిగా అలంకరించారు. దేవస్థానం మండపంలో మహిళలతో అర్చకులు కుంకుమ పూజలు చేయించారు. బొండపల్లి మండలంలోని దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని లక్ష రూపాయలతో అలంకరించారు. జామి బజారు సెంటర్వద్ద దేవీ మండపంలో అమ్మవారిని రూ.10, రూ.20,రూ.50 నోట్లతో అలంక రించారు. దత్తిరాజేరు మండలంలోని గడసాం, మరడాం, కోమటిపల్లి, పెదమానాపురం గ్రామాల్లోని మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేపాడ మండలంలోని వల్లంపూడి సాయిబాబా ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు శాకంబరీమాతగా దర్శనమిచ్చారు. – చీపురుపల్లి/బొండపల్లి/ జామి/దత్తిరాజేరు/వేపాడ


దత్తిరాజేరు: పెదమానాపురంలో మహాలక్ష్మిగా పూజలందుకుంటున్న దుర్గమ్మ


వేపాడ: వల్లంపూడిలో శాకంబరీమాతగా దర్శనమిస్తున్న దుర్గాదేవి

గరిష్ట వేతనం అందేలా పనులు చేయించాలి


ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం:ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్టవేతనం అందేలా వారి తో పనులు చేయించాలని ఎంపీడీఓ బి.కల్యాణి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్తో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ముగి సిన అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ వేతనదారు లకు రోజుకు రూ.300 వేతనం అందేలా పనులు చేయించాలన్నారు. వేతనం గిట్టుబా టు అయితేనే పనులకు హాజరయ్యే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. మండలానికి 3వేల పని దినాల లక్ష్యాన్ని ప్రభుత్వంఇచ్చిందని, తెలిపారు. ఈటీపీ ఆర్డీ బి.సుగుణాకరరావు, ఉపాధి హామీ ఏపీఓ సీహెచ్.రామారావు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టిసారించండి


గజపతినగరం: శిక్షణ పూర్తి చేసుకున్న ఉపసర్పంచ్లు, వార్డు మెంబర్లతో అధికారులు

గజపతినగరం: గ్రామాల్లో సమస్యలపై ఉపసర్పంచ్లు, పంచాయతీ వార్డు మెంబర్లు దృష్టిపెట్టి వాటి పరిష్కారానికి సర్పంచ్తో కలిసి కృషి చేయాలని ఎంపీడీఓ బి.కల్యాణి సూచించారు.2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళికలపై మండలంలోని రెండో బ్యాచ్ ఉపసర్పంచ్లు,వార్డుమెంబర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం ,తాగునీరు,సామాజిక,వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం,పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై సర్పంచ్తో కలిసి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటిపన్ను వసూళ్లు, ప్రభుత్వ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి పుష్పలత, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనార్దన రావు,ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో నేడు,రేపు శిక్షణ

దత్తిరాజేరు: 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్జీఎస్ఏ కార్యాచరణ ప్రణాళికలపై మండలంలోని ఉప సర్పంచ్లు,వార్డ్ మెంబర్లకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం, గురువారం రెండురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు.తొలిరోజు 18 గ్రామాల ఉప సర్పంచ్లు,వార్డ్ మెంబర్లకు,రెండో రోజు 17 గ్రామాల ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లకు శిక్షణ ఉంటుందని, అంతా హాజరు కావాలని కోరారు.

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మండలంలోని ఉపసర్పంచ్లకు, వార్డు మెంబర్లకు బుధవారం, గురువారం రెండు రోజుల పాటు ఎంపీడీఓ జి.భా స్కరరావు ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు మండల పరిషత్ కార్యాలయ ఏఓ వద్దాది వెంకటరమణమూర్తి మంగళవారం తెలిపారు. బుధవారం 15 మంది ఉపసర్పంచ్లు,30మంది వార్డు మెంబ ర్లకు, గురువారం13 మంది ఉపసర్పంచ్లు, 28 మందివార్డు మెంబర్లకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

వేతన వెతలు

దత్తిరాజేరు: మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో సీపీడబ్ల్యూ రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేసే వాల్వ్ (లైన్)ఆపరేటర్లకు కొన్ని నెలలుగా జీతాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో పలు వురు ఆపరేటర్లు మంగళవారం సాక్షితో మాట్లాడుతూ రోజూ తెల్లవారు ఝామున వాటర్ ట్యాంకర్లలో నీరు నింపి, ఎక్కడా కుళాయి పైపులైన్లకు లీకులు కాకుండా పర్యవేక్షిస్తుంటామని, ఇదే పనిగా జీవిస్తున్న తమకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం జీతాలు అందించకపోవడంతో దసరా పండగ పూటా కూడా పస్తులు తప్పేలా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఈ విషయాన్ని రక్షిత పథకాల నిర్వహణ చూసే సింగన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి వద్ద సాక్షి ప్రస్తావించగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఆపరేటర్లకు జీతాలు చెల్లించ లేదని చెప్పారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం


గర్భాంలో యువత, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న హెచ్సీ అంజిబాబు

మెరకముడిదాం: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, యువత వాటికి దూరంగా ఉండాలని బుధరాయవలస పోలీస్ స్టేషన్ హెడ్కానిస్టేబుల్ అంజిబాబు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్తో కలిగే అనర్థాలపై గర్భాం గ్రామ ప్రజలకు మంగళవారం సాయంత్రం అవగాహన కల్పించారు.మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వాటికి బానిసగా మారొద్దని హితవు పలికారు. పిల్లల ప్రవర్తన, వారి నడవడికను తల్లిదండ్రులు గమని స్తూ ఉండాలని, గంజాయి, గుట్కా, ఖైనీ, సారా విక్రయించడం, రవాణా చేయడం వంటివి చేస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

ట్రేడ్ లైసెన్స్లు తప్పనిసరి

విజయనగరం: విజయనగరం నగర పరిధిలో ఉన్న ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన ట్రేడ్ లైసెన్స్పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి మాట్లాడుతూ విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏ వ్యాపారానికైనా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి అన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ట్రేడ్ లైసెన్సులు పొందిన తర్వాతనే వ్యాపారాలు సాగించాలన్నారు. ఇది వరకే ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉన్నట్లయితే తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


గంట్యాడ: బోనంగిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు


జామి: ఆర్.బి.పురంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్కుమార్, వ్యవసాయ సిబ్బంది


గుర్ల: గుజ్జింగివలసలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ తిరుపతిరావు


బొండపల్లి: వరిలో తెగుళ్ల నివారణపై రాచకిండాం గ్రామ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు


వేపాడ: చామలాపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గంట్యాడ: పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు రైతులకు సూచిం చారు.మండలంలోని బోనంగి గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు మోతాదుకు మించి ఎరువులు, పురుగులు మందులు వాడకూడదన్నారు.వరి పంటను పాముపొడ, ఆకుముడత తెగుళ్లు ఆశిస్తున్నాయని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. ఏఓ శ్యామ్ కుమార్, పశు వైద్యాధికారి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బొండపల్లి: రైతులు అప్రమత్తంగా ఉంటూ పంటలను ఆశించే తెగుళ్లను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు సూచించారు. రాచ కిండాం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పంటల యాజమాన్యపద్ధతులపై అవగాహన కల్పించారు పశువైద్యాధికారి లక్ష్మీ దీపిక, ఏఈఓ సంతోష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

జామి: వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ కిరణ్కుమార్ అన్నారు. మండలంలోని జె.డి.వలస, ఆర్.బి.పురం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. పంటను ఆశించిన పాముపొడ తదితర తెగుళ్ల నివారణ చర్యలను, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఏఈఓ గీత, వీఏఏ ఖరీమ్ తదితరులు పాల్గొన్నారు.

గుజ్జింగివలసలో..

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో ఏఓ ఎం.తిరుపతిరావు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరి పంటను పరిశీలించి, కుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు హెక్సాకొనజోల్ మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. వీఏఏ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చామలాపల్లిలో...

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు మంగళవారం 'పొలం పిలు స్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఆనందరావు, ఏడీఏ విజయ, ఏఓ యశ్వంత్ వరి పంటను పరిశీలించి, తెగు ళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముందు ప్రకృతి వ్యవసాయంపై మండల సమాఖ్యలో ఈసీలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. డీపీఎం ఆనందరావు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో సాగే ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరిగేలా ఈసీలు, వీఓఏలు గ్రామాల్లో రైతులను చైతన్యవంతం చేయాలని సూచించారు. డీఎల్ఎంపీ స్వామినాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమాప్రభ, వసంత పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 226 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

గజపతినగరం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాల లైసెన్స్ కోసం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్కు 226 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు తెలిపారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో మంగళవారం ఆయన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మద్యం దుకాణాల కోసం గజపతిన గరం మండలం నుంచి 82, మెంటాడ మండలం నుంచి 36, బొండపల్లి మండలం నుంచి 71, దత్తిరాజేరు మండలం నుంచి 37 దరఖాస్తులు వచ్చాయన్నారు. బుధవారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. లాటరీ ప్రక్రియ 11వ తేదీన జిల్లా కేంద్రంలో ఉంటుంద ని తెలిపారు. ముందుగా ప్రకటించినట్లు విజయనగరంలోని ఆనందగజపతి ఆడిటోరియం సంస్కృత కళాశాల ఎదురుగా కాకుండా, ఎస్.వి.ఎన్ నగర్, సరస్వతీదేవి టెంపుల్ రోడ్డులోని సుజాత కన్వెన్షన్ సెంటర్లో ఉంటుందని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు 11వ తేదీన ఉదయం 8గంటలకు హాజరు కావాలని సూచించారు.

శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ చేస్తున్న సీపీఐ సమితి నాయకులు

శృంగవరపుకోట: ప్రపంచ శాంతిని భగ్నం చేసేలా, ప్రజల ధన, ప్రాణాలను బలితీసుకునేలా పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఆపాలని శృంగవరపుకోట నియోజకవర్గ సీపీఐ సమితి నాయకులు డిమాండ్ చేశారు.ఎస్.కోట పట్టణంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సీపీఐ సమితి కార్యదర్శి దేగల అప్పలరాజు మాట్లాడుతూ ఇజ్రాయిల్పై హమాస్ 2023 అక్టోబర్ 17న దాడి చేశారనే నెపంతో ఆత్మరక్షణ కోసం ప్రతిదాడి చేస్తున్నామంటూ పాలస్తీనాలో గాజా, లెబనాన్లపై తీవ్ర దాడులు చేస్తూ మహిళలు, చిన్నారులుపై బాంబుల వర్షం కురిపిస్తున్నారన్నారు. ఈ దాడుల్లో వేల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దేశాలు ఏవైనా ప్రజలంతా ఒక్కటే అన్న భావన మరిచిపోయారన్నారు. ఈ సంక్షోభం కొనసాగితే ప్రపంచయుద్ధానికి దారి తీస్తుందన్నారు. భారత్ అమెరికాకు వంత పాడడం విచారమని, అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ రెచ్చిపోతోందని,ఈ తరహా ఘటనలు, దాడుల వల్ల భవిష్యత్లో ప్రపంచశాంతి ప్రమాదంలో పడుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర దౌత్యం నెరపాలన్నారు. సీపీఐ నాయకులు కె.భీముడు, ఎస్.శ్రీను, రామకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు

- 9 తులాల బంగారం, ఆటో సీజ్
- 3 రోజుల్లోనే చోరీ కేసు ఛేదన
- పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ దీపిక


నిందితులతో పోలీసులు

అనకాపల్లి: దారి దోపిడీ కేసును మూడు రోజుల్లోనే అనకాపల్లి పట్టణ పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి 9 తులాల బంగారం, ఆటో స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో ఎస్పీ దీపిక మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కె.కోటపాడు మండలం గొట్లం గ్రామానికి చెందిన రావుల ఎల్లారమ్మ(59), విజయనగరం జిల్లా కొత్తవలసలోని 202 కాలనీకి చెందిన మేకల సంధ్య(28), గంటా మీనా (30), కొత్తవలస మండలం సుందరయ్యపేటకు చెందిన ఆటో డ్రైవర్ మేకల హరి (21), మరో ఇద్దరు ముఠాగా ఏర్పడి ఆటోలో తిరుగుతూ దారి దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఏపీ జెన్కోలో పనిచేస్తున్న చెక్క సుధా కూర్మన్నపాలెం వెళ్లేందుకు ఈ నెల 5న అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ బయట వేచి ఉంది. ఆ సమయంలో ఇద్దరు మహిళలతో వచ్చిన ఆటోడ్రైవర్ గాజువాక వెళ్తున్నట్టు చెప్పడంతో సుధా ఆటో ఎక్కారు. అనంతరం జాతీయ రహదారిలో జలగల మదుం వద్ద సదరు మహిళలు కత్తితో బెదిరించి బ్యాగ్లో ఉన్న రూ.1.80 లక్షలు విలువగల బంగారాన్ని లాక్కుని ఆమెను ఆటో నుంచి తోసి వేసి పరారయ్యారు. అదేవిధంగా మరో కేసులో మునగపాక మండలం తిమ్మరాజు పేట గ్రామానికి చెందిన తిరునగరి గోవిందమ్మ(60) అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా పై నిందితులు అచ్యుతాపురం వెళ్తున్నామని ఆమె ఆటోలో ఎక్కించుకున్నారు. పూడిమడక రోడ్డులో నిందితులు కత్తులు చూపించి ఆమె వద్ద 9 తులాల బంగారాన్ని లాక్కుని పరారయ్యారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ టి.వి.విజయ్ కుమార్ కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుల్లో ఇంకా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉంది. వీరందరిపై వివిధ జిల్లాల్లో మొత్తం 45 దొంగతనం కేసులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ దీపిక అనకాపల్లి టౌన్ పోలీసులను ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను ప్రకటించారు.